నమస్తే తెలంగాణ

నల్లగొండ, సోమవారం 3 ఫిబ్రవరి 2025
MONDAY, FEBRUARY 3, 2025

## రంగశాయిరెడ్డి సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి


సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

నిడమనూరు, ఫిబ్రవరి 2 : పార్టీలకతీతంగా ప్రజలకు యడవల్లి రంగశాయిరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. ఇటీవల మృతి చెందిన తుమ్మడం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రంగశాయిరెడ్డి సంస్మరణ సభను ఆదివారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడుతూ ఉన్నత విలువలతో కూడిన రాజకీయాలతో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అంతకు ముందు రంగశాయిరెడ్డి చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఎల్పీ మాజీ నాయకుడు కుందూరు జానారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్, నాగార్జునసాగర్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు నూకల వెంకట్‌రెడ్డి, అంకతి వెంకటరమణ, కేశ శంకర్, షేక్ సలీంపాషా పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

గుర్రంపోడు, ఫిబ్రవరి 2: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో రైతులందరికీ రైతుబంధు ద్వారా ఎకరాకు రూ.10వేలు అందాయన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15వేల రైతుభరోసా ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.12వేలు అని మాట మార్చిందని, అవి కూడా మండలానికి ఒక గ్రామంలోని రైతులకు మాత్రమే ఇస్తున్నదన్నారు. ఎక్కువ మంది రైతులున్న గ్రామాలను వదిలేసి తక్కువ మంది ఉన్న గ్రామాలను ఎంచుకుని రైతు భరోసా అమలు చేయడం సిగ్గు చేటన్నారు. రేవంత్‌రెడ్డి రైతులకు, ప్రజలకు చేసిన మోసానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నాగులవంచ తిరుపతిరావు, నాయకులు, పాల్గొన్నారు.

## బీజేపీ మంత్రులు, ఎంపీలు రాజీనామా చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రంగారెడ్డి


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నందికొండ, ఫిబ్రవరి 2: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయింపులు చేయలేదని, ఇందుకు బాధ్యత వహిస్తూ రాష్ట్రానికి చెందిన 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా, కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చేలా ఉందన్నారు. మధ్య తరగతి వారికి నష్టం కలిగేలా, సామాన్యులకు ఉపయోగం లేకుండా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన చట్టానికి తూట్లు పొడుస్తూ బడ్జెట్‌ను రూపొందిచారని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నట్లుగా ఇది డ్రీమ్ బడ్జెట్ కాదని, దివాలా కోరు బడ్జెట్ అని ఎద్దేవాచేశారు. కేంద్రం కాకులను కొట్టి గద్దలకు వేసినట్లుగా వ్యవహరిస్తున్నదని, దీనిపై సీపీఎం ఆధ్వర్యంలో అన్ని సంఘాలను కలుపుకొని దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపడుతామన్నారు. అనంతరం నాట్కో ఫార్మా కంపెనీకి, నందికొండ మున్సిపాలిటీకి చెందిన పలువురు కార్మికులు జూలకంటి సమక్షంలో సీఐటీయూలో చేరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి,

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- బీఆర్ఎస్ నాయకుడు మల్లేశ్‌గౌడ్


యువతతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మల్లేశ్‌గౌడ్

వేములపల్లి, ఫిబ్రవరి 2: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా మల్లేశ్‌గౌడ్ కోరారు. ఆదివారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో గంజాయి నిషేధంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి, మాదకద్రవ్యాలు శెట్టిపాలెం గ్రామంలోకి రాకుండా చూడాలన్నారు. మత్తుపదార్థాల వల్ల యువత తమ జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా మహిళలపై అఘాయిత్యాలు, అమాయక ప్రజలపై దాడులు పెరిగి పోతున్నాయన్నారు. అనంతరం యువతతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కాట్రగడ్డ రాజగోపాల్‌రావు, కట్టా వెంకటయ్య, కట్కూరి వేణు, నక్క శ్రీధర్, ఎర్రబెల్లి చంటి, నిర్మల, వెంకన్న, ధూపాటి విక్రమ్, రాంబాబు, సైదిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు నందికొండ విద్యార్థులు


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నందికొండ, ఫిబ్రవరి 2 : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్ విద్యార్థులు జె.సుప్ల విరాజ్, ఎస్‌కే రిజ్వాన్ నెట్‌బాల్ క్రీడలో ఇండియన్ ఒలంపిక్స్‌కి ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ కిరణ్ తెలిపారు. ఇటీవల మహబూబ్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన నెట్‌బాల్ క్రీడాకారుల క్యాంపులో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. వీరు ఈ నెల 6 నుంచి 15వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ నెట్‌బాల్ పోటీల్లో(ఇండియన్ ఒలపిక్స్)లో పాల్గొననున్నట్లు తెలపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

## యువత క్రీడా స్ఫూర్తిని చాటాలి : ఎస్ఐ

మర్రిగూడ, ఫిబ్రవరి 2 : యువత క్రీడా స్ఫూర్తిని చాటాలని ఎస్ఐ కృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని వట్టిపల్లిలో రామలింగేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎస్ఐ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిరసవాడ భిక్షం, ప్రధాన కార్యదర్శి కొంపెల్లి నాగరాజుగౌడ్, మాజీ సర్పంచ్ ఎడ్ల కాశయ్య, నాయకులు కొడాల అల్వాల్‌రెడ్డి, సల్వోజు భిక్షమాచారి, కొనరెడ్డి గిరి, శ్రీకాంత్, లింగయ్య, రాజు, గణేశ్, విజయ్, రఘు, సల్మాన్ పాల్గొన్నారు.

**ప్రకటన**

నా క్లయింట్ అయిన మంగదుడ్ల స్వాతి, భర్త: శ్రీనివాసరావు వయసు 39 సం., వృత్తి, గృహిణి, నివాసం ఇంటి నం.6-4-163, శ్రీనివాస కాలనీ, నల్లగొండ టౌన్ & జిల్లా గారు ఇచ్చు ప్రకటన ఏమనగా నా యొక్క ఖాళీ స్థలం యొక్క దాన దస్తావేజు నం.172/2015 SRO-Nalgonda ద్వారా పొందియున్నాను, దాని యొక్క ఒరిజినల్ లింక్ విక్రయ దస్తావేజు నం.5241/1984, Dated:18-12-1984 & 6095/2002, dated:20-09-2002, SRO-Nalgonda, మా ఇంటి నుండి బస్ స్టాండ్‌కి వెలుచుండగా మార్గ మధ్యలో పోయినది కావున ఇట్టి విషయము పై నల్లగొండ-II టౌన్ పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చినాము, సదు ఆస్తి యొక్క వివరములు ప్లాట్ నం.57, సర్వే నం.834, విస్తీర్ణం 350.00 చదరపు గజాలు 292.64 చదరపు మీటర్లు వార్డు నం.6, బ్లాక్ నం.2, శ్రీనగర్ కాలనీ, నల్లగొండ టౌన్ & జిల్లా సదరు ఆస్తి యొక్క హద్దులు ఉత్తరం:33.00 వైడ్ రోడ్డు, దక్షిణం: ప్లాట్ నం.76, తూర్పు, ప్లాట్ నం.58, పడమర: సొసైటీ భూమి, ఎవ్వరికైనను పై దస్తావేజు దొరికినచో నా క్లైంటుకు తిరిగి ఇవ్వగలరు. ఇట్టి విషయంపై ఎవ్వరికైనను ఎటువంటి అభ్యంత్రమున్నచో తగిన ఆదారములతో (5) వారం రోజులలో ఈ క్రింది తెలిపిన అడ్రస్‌లో సంప్రదించగలరు.

సం/- నాంపల్లి చంద్రశేఖర్
న్యాయవాది & నోటరీ
ఇంటి నం.6-2-439/1, శ్రీనగర్ కాలనీ,
నల్లగొండ-508001, తెలంగాణ,
సెల్: 9440422393

నల్లగొండ
తేదీ:01-02-2025

## మాడ్గులపల్లి డీటీగా సైదులు

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 2: మండల డిప్యూటీ తాసీల్దార్‌గా కత్తుల సైదులు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన డీటీ నాలుగు నెలల క్రితం శాలిగౌరారం డీటీగా బదిలీకాగా ఆయన స్థానంలో తిప్పర్తిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సైదులు పదోన్నతిపై మాడ్గులపల్లి డీటీగా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సైదులుకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# కమ్మేసిన పొగ..మంచు

- చందనపల్లి వాసులు ఉక్కిరిబిక్కిరి
- దారి కనిపించక వాహన దారుల అవస్థలు
- డంపింగ్ యార్డులోనే చెత్త తగులబెట్టడంతో ఇబ్బందులు


చందనపల్లిలో డంపింగ్ యార్డు వద్ద పొగ కారణంగా పగటిపూట కూడా లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనదారులు

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 2: నల్లగొండ పట్టణ శివారులోని చందనపల్లి సమీపంలో ఉన్న డంపింగ్ యార్డులో ఆదివారం ఉదయం చెత్తను తగలబెట్టడంతో పొగ కమ్ముకుంది. దానికి తోడు తెల్లవారు జామున దట్టమైన పొగమంచు కమ్ముకోగా.. దానికి తోడు డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నల్లగొండ నుంచి నకిరేకల్ వైపు వెళ్లే వాహనదారులకు దారి కనిపించక పోవడంతో లైట్లు వేసుకొని మరీ ప్రయాణించాల్సి వచ్చింది. తాను గెలిస్తే చందనపల్లి వద్ద ఉన్న డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలిస్తామని అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆయన గెలిచి మంత్రి అయినా కూడా సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఇటీవల తిప్పర్తి మండల పర్యటనలో ఉన్న మంత్రిని చందనపల్లి గ్రామ ప్రజలు కలిసి డంపింగ్ యార్డు తరలించమని కోరితే.. డంపింగ్ యార్డు ఏర్పాటు చేశాక, వేరే చోటుకు తరలించడం అంత ఆశామాషి కాదని చెప్పినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తమకు ఇచ్చిన హామీని మంత్రి నెరవేర్చాలని, డంపింగ్ యార్డును వేరే చోటుకు మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రాజీవ్‌రెడ్డి, లారెన్ ఫిషర్ దంపతులు

## లండన్ అమ్మాయి.. పెద్దకాపర్తి అబ్బాయి

### వివాహబంధంతో ఒక్కటైన జంట

చిట్యాల, ఫిబ్రవరి 2 : లండన్‌కు చెందిన యువతిని పెద్దకాపర్తికి చెందిన యువకుడు ప్రేమించి ఆదివారం పెండ్లి చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పెద్దకాపర్తికి చెందిన కందిమళ్ల మహేందర్‌రెడ్డి కుమారుడు రాజీవ్‌రెడ్డి కొంత కాలంగా న్యూజిలాండ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. లండన్‌కు చెందిన యువతి లారెన్ ఫిషర్ న్యూజిలాండ్‌లో తమ బంధువుల ఇంట్లో ఉండి చదువుకుంటూనే పోలీస్ ఉద్యోగం చేస్తున్నది. రాజీవ్‌రెడ్డికి ఫిషర్‌తో నాలుగేండ్ల క్రితం పరిచయం కాగా అదికాస్తా ప్రేమగా మారింది. దాంతో వారిద్దరూ కుటుంబ సభ్యులను ఒప్పించి ఆదివారం హైదరాబాద్‌లో బంధువుల సమక్షంలో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు.

## కోడ్ ఉల్లంఘనపై ఎన్నికల కమిషనర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

నీలగిరి, ఫిబ్రవరి 2 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ ఆధ్వర్యంలో ఆదివారం భారత ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకుల ఫొటోలతో భారీ ఫ్లెక్సీలు, కటౌట్లను నల్లగొండ పట్టణంలోని ప్రధాన కేంద్రాల వద్ద ఏర్పాటు చేశారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చిన మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా రోడ్ల వెంట ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని తాము కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా తన విధులను విస్మరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలకు వత్తాసు పలికే అధికారులు ఉంటే ఎన్నికలు సవ్యంగా, న్యాయబద్ధంగా జరుగవని, వెంటనే మున్సిపల్ కమిషనర్‌ను విధుల నుంచి తొలగించాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు.

## చైనా వస్తువుల్లాగా కాంగ్రెస్ పథకాలు

- బీఆర్ఎస్ నాయకుడు ఎనుగుల రాకేశ్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎనుగుల రాకేశ్‌రెడ్డి

గుర్రంపోడ్, ఫిబ్రవరి 2: కాంగ్రెస్ పథకాలన్నీ చైనా వస్తువులుగా మారాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చైనా వస్తువులు రెండు రోజులు వాడగానే పని చేయకుండా పోయినట్లే కాంగ్రెస్ హామీలు కూడా అమలవుతాయో లేదో చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో మంత్రుల ఒక్కొక్కరు ఒక్కో తీరుగా మాట్లాడుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గెలిచిన తరువాత ఏ జిల్లాలోనూ పర్యటించలేదని, ఢిల్లీకి మాత్రం 30 సార్లు వెళ్లి వచ్చారని పేర్కొన్నారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు వారి ప్రయోజనాల కోసమే పని చేస్తున్నారని, ప్రజల కోసం చేయడం లేదని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నాగులవంచ తిరుపతిరావు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ పామనగుండ్ల వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

### బెస్త కులస్తుల్లో రాజకీయ చైతన్యం పెరుగాలి :అంబటి వెంకన్న

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 2: బెస్త కులస్తుల్లో రాజకీయ చైతన్యం పెరుగాలని ప్రముఖ కవి అంబటి వెంకన్న, బెస్త సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం బెస్త సేవా సంఘం ఆర్భావ దినోత్సవాన్ని నల్లగొండలో శ్రీనగర్ కాలనీలోని గంగపుత్ర సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెస్తలకు అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలని, రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంబటి మురళీధర్, పూర్ణచందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం

మర్రిగూడ, ఫిబ్రవరి 2 : మండలంలోని మేటిచందాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గుల్లి యాదయ్య తల్లి ముత్తమ్మ ఆదివారం మృతి చెందారు. మాజీ ఎంపీటీసీ ఊరిపక్క సరితానగేశ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు చెర్కు లింగం గౌడ్, ఐతగోని యాదగిరిగౌడ్ ఆదివారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.15వేల ఆర్థిక సాయాన్ని అందించారు. వారి వెంట బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఐతగోని అశోక్ గౌడ్, రఘు, మౌలాలి, శివ, హుస్సేన్, నర్సింహ, యాదయ్య, సతీశ్, మారయ్య ఉన్నారు.

### కట్టంగూర్‌లో

కట్టంగూర్ : మండల కేంద్రానికి చెందిన గోగు పార్వతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గండమల్ల చెన్నయ్య, పెద్ది ఫౌండేషన్ చైర్మన్ పెద్ది బాలనర్సయ్యగౌడ్ ఆదివారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10వేల ఆర్థికసాయం అందించారు. వారి వెంట మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సరళ, జిల్లా అధ్యక్షురాలు అంగరాజు స్వర్ణలత, బీఆర్ఎస్ నాయకులు చౌగోని జనార్దన్, అంతటి శ్రీను, బొల్లెద్దు నర్సింహ. యర్రకల మల్లేశ్ ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ అధికారులకు గాయాలు


వాహనంలో ఇరుక్కున్న వారిని బయటికి తీస్తున్న స్థానికులు

కట్టంగూర్, ఫిబ్రవరి 2 : మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ఆర్టీసీ అధికారులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ తనిఖీ అధికారులు బొలేరో వాహనంలో సూర్యాపేట నుంచి నల్లగొండకు బయల్దేరారు. అయిటిపాముల గ్రామ శివారులోని రాఘవేంద్ర ఫెర్రోఅల్లాయిస్ కంపెనీ వద్ద ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దాంతో బొలేరో వాహనం లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. అదే క్రమంలో దాని వెనుక నుంచి వస్తున్న మరో వాహనం బొలేరోను ఢీకొట్టింది. ప్రమాదంలో బొలేరో వాహనంలో ఉన్న ఆర్టీసీ అధికారులు బీరం ఉపేందర్‌రెడ్డి, గరిణిపల్లి నర్సింహారావు, వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనంలో ఇరుక్కు పోయిన వారిని స్థానికులు, ఇతర వాహనదారులు బయటికి తీసి 108 వాహనంలో నకిరేకల్ ప్రభుత్వం దవాఖానకు తరలించారు. టీసీ శేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

## గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి :వెంకటేశ్వర్లు

వేములపల్లి, ఫిబ్రవరి 2: విద్యార్థులు, ఉద్యోగులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీవీటీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తాళ్ల వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని ఆమనగల్లు గ్రామ గ్రంథాలయ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి వెంకటేశ్వర్లు పుస్తకాలను, సీసీ కెమెరాను అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అబ్రహం, నాయకులు కోల సైదులు, వీరేందర్, చుక్కయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కంటి వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 2: మండలంలోని కన్నెకల్ గ్రామానికి చెందిన మారెపల్లి రంగారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి, కోడలు డాక్టర్ మనోహరమ్మ ఆధ్వర్యంలో శంకర్ ఆస్పత్రి సహకారంతో గ్రామంలో వారం రోజులుగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన 150 మందికి ఆదివారం ఐ, క్యాట్రాక్ట్ ఆపరేషన్లు నిర్వహించారు. వంద మందికి కంటి వైద్యం నిమిత్తం చెన్నై ఆస్పత్రికి తరలించారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి కార్యక్రమానికి హాజరై నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు కొండేటి మల్లయ్య, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, యాదగిరి, సైదిరెడ్డి పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


శాలిగౌరారం : సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

శాలిగౌరారం, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ఫంక్షన్‌హాల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.


మునుగోడు : సమ్మేళనంలో పాల్గొన్న కొంపెల్లి జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మునుగోడు : మండలంలోని కొంపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 టెన్త్ బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సదర్భంగా అప్పటి ప్రధానోపాధ్యాయుడు రంగారెడ్డి, ఉపాధ్యాయులు సోమవరపు రాములు, ముచ్చర్ల శ్రీనివాస్, దేవరశెట్టి జనార్దన్, రామసహాయం అశోక్‌రెడ్డి, అటెండర్ రాములును ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి రూ.50వేలు ప్రకటించారు.

## బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల, ఫిబ్రవరి 2 : బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని పేరేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పోలోజు వెంకటాచారి ఇటీవల మృతి చెందాడు. అతడి కుటుంబానికి పార్టీ కల్పించిన ప్రమాద బీమా కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఆదివారం చిరుమర్తి లింగయ్య అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెర్వుగట్టు జాతరకు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్


ఎస్పీ శరత్‌చంద్రపవార్

నీలగిరి, ఫిబ్రవరి 2 : చెర్వుగట్టు జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా, ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వరకు జాతర జరుగనున్నదని తెలిపారు. ఐదుగురు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 93 మంది ఎస్ఐలు, 186 మహిళ సిబ్బందితో మొత్తం 900 మందితో భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్య రాకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వాహనదారులు రోడ్డుపక్కన వాహనాలు ఆపి భక్తులకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు క్యూలైన్‌లో వెళ్లేందుకు ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జాతరలో దొంగతనాలు నివారించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. గుట్ట పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశామని, వాటి ద్వారా నిత్యం పర్యవేక్షణ చేస్తామని స్పష్టం చేశారు. భక్తులకు ఏవైనా ఇబ్బందులు కలిగితే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు.

## కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

నిడమనూరు, ఫిబ్రవరి 2 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చెయ్యి చూపడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేశ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్, సంపన్న వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉందన్నారు. బీజేపీ, కూటమి పాలిత రాష్ట్రాలకు మాత్రమే నిధులు కేటాయించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమాండ్ల గుర్వయ్య, చంద్రశేఖర్, కుంచం శేఖర్, వింజమూరి శివ, తోటపల్లి బాలనారాయణ, వెంపటి మహేశ్, లెంకలపల్లి పరిపూర్ణాచారి, పుల్లయ్య పాల్గొన్నారు.

### బడ్జెట్ ప్రతులు దహనం

మిర్యాలగూడ : సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్ మాట్లాడుతూ తెలంగాణాకు నిధులు తెచ్చేలా ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్చంద్ర, రవినాయక్, రెమడాల పరుశురాములు, వినోద్‌నాయక్, కోటిరెడ్డి, కోడిరెక్క మల్లయ్య, రాంరెడ్డి, కరీమున్నిసా బేగం పాల్గొన్నారు.


నల్లగొండలో నిర్వహించిన నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

## ఘనంగా చెర్వుగట్టు నగరోత్సవం

రామగిరి, ఫిబ్రవరి 2: చెర్వుగట్టు పార్వతి జడల రామలింగేశ్వరస్వామి జాతరను పురస్కరించుకొని ఆదివారం రాత్రి నల్లగొండలో నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, దేవాలయ అధికారులు రామగిరిలోని రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి నగరోత్సవాన్ని ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి కోలాటాలు, నృత్యాలతో హైదరాబాద్ రోడ్డు మీదుగా చెర్వుగట్టు వరకు నగరోత్సవం కొనసాగింది.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 2 : మండలంలోని గోపలాయపల్లి గ్రామ పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియాలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ కె.చంద్రశేఖర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రంలోని 33 కేవీ స్టాండ్డై పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

## చలో హైదరాబాద్‌కు తరలిరావాలి : ఎమ్మార్పీఎస్

నల్లగొండ సిటీ ఫిబ్రవరి 2 : ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ బోడ సునీల్, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ కోరారు. ఆదివారం స్థానిక నాగార్జున డిగ్రీ కళాశాల ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, ఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేశ్, మల్లెపాక వెంకన్న, నగేశ్, దేవయ్య పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

నల్లగొండ రూరల్ : ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు, వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సంఘం నాయకులు ఆదివారం పట్టణంలోని గొల్లగూడలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కత్తుల తులసీదాస్, నాయకులు కత్తుల జగన్, కారన్ జయరాజ్, ఎల్లయ్య, సైదులు, రాంబాబు, తొలకొప్పుల గిరి పాల్గొన్నారు.

## 'నార్కట్‌పల్లిలో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి'

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 2 : నార్కట్‌పల్లి మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డివైడర్ పనులు పూర్తి చేయాలని అఖిలపక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 15 నెలలుగా అంసపూర్తిగా ఉన్న రోడ్డు పనుల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద అసంపూర్తిగా ఉన్న రోడ్డుతో చాలా మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడినట్లు తెలిపారు. పట్టణ కేంద్రంలో కూడా డివైడర్ ఏర్పాటు చేయక పోవడంతో కూరగాయల షాపుల వద్ద రద్దీ ఏర్పడి పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు చిరుమర్తి యాదయ్య, పుల్లెంల ముత్తయ్య, దుబ్బాక శ్రీధర్, చింత లక్ష్మి, ఆమనగంటి ఐలయ్య, కొప్పు శ్రవణ్‌గౌడ్, వెంకటి శ్రీను, లింగాల యాదయ్య, చెన్నారపు సత్తయ్య, చింత లక్ష్మణ్, కన్నెబోయిన నర్సింహ, అంజిరెడ్డి పాల్గొన్నారు.